వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానిస్తున్న ఎత్తరి అంతయ్య

చిక్కడపల్లి: వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని, వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని వడ్డెర భవన సముదాయ ట్రస్ట్ వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి కోరారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు. వడ్డెరుల సమస్య పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు అంజయ్య, నాగరాజు, రాజు, అనంతరావు పాల్గొన్నారు.

హైదరాబాద్ స్టేట్ పార్టీ ఆవిర్భావం


హైదరాబాద్ స్టేట్ పార్టీ ఆవిర్భావ సదస్సులో ద్రాక్షాయణిని సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ స్టేట్ పార్టీతో పాటు లోగో, విధి విధానాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండు అంజయ్యనేతాజీ మాట్లాడుతూ హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా ఏర్పాటు చేయాలని, అందుకోసం తాము రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. దేశంలోనే మంచి గుర్తింపు పొందిన హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది ప్రజలు వలస వచ్చి నగరంలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. అలాగే వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ స్టేట్ పార్టీ రాష్ట్ర నాయకుడు బి.వి.నాయక్, దళిత సంఘం నాయకులు జే.బి.రాజు, కళా సామ్రాట్ బిక్కి కృష్ణ, సామల లింగమూర్తి, భూక్యా శంకర్‌నాయక్, ఎండీ షాజహాన్, కల్యాణ్ నాయక్, నవీనారాణి పాల్గొన్నారు.

రామకృష్ణమఠంలో స్వామి వివేకానంద జన్మతిథి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న స్వామి బోధమయానంద, భక్తులు

కవాడిగూడ: రామకృష్ణమఠంలో స్వామి వివేకానంద జన్మతిథి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామకృష్ణుల విశ్వజనీన ఆలయంలో ఉదయం 5:30 గంటలకు సుప్రభాతం, మంగళహారతి, భజనలు, 6:30 దేవాలయ ప్రదక్షిణ, 7 గంటలకు విశేషపూజ, కఠోపనిషత్ పారాయణం, భజనలు, 10:30 హోమం, పూజలు నిర్వహించగా రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో స్వామి వివేకానంద జీవితంపై సందేశం ఇచ్చారు. వివేకానంద ఆశయసాధనకు నేటి యువత పాటుపడాలని స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. అనంతరం స్వామి వివేకానంద చలనచిత్రాన్ని ప్రదర్శించారు.

వీవీగిరినగర్ బస్తీలో కార్పొరేటర్ పర్యటన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీ, బస్తీవాసులు

చిక్కడపల్లి: డివిజన్‌లోని వీవీగిరినగర్ బస్తీలో కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లోరింగ్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, బస్తీవాసులు నర్సింగ్‌రావు, సాయికుమార్, శ్రీనివాస్, అరుణ్ పాల్గొన్నారు.

శోభన్‌బాబు చిత్రాలకు నేటికీ ఆదరణ


ఎం.నరసింహారావును అభినందిస్తున్న సేవా సమితి సభ్యులు

చిక్కడపల్లి: శోభన్‌బాబు గొప్ప నటుడని, ఆయన నటించిన సినిమాలు నేటికీ ప్రజాదరణకు నోచుకుంటున్నాయని రాశీ మూవీస్ అధినేత ఎం.నరసింహారావు అన్నారు. శోభన్‌బాబు నటించిన బావామరదళ్లు సినిమా విడుదలై శుక్రవారానికి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి సభ్యులు నరసింహారావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ బావా మరదళ్లు సినిమా రికార్డు సృష్టించిందన్నారు. మొట్టమొదటి స్టార్ చిత్రంగా విడుదలై 18 కేంద్రాల్లో 100 రోజులు ఆడిందన్నారు. కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, పూడి శ్రీనివాస్, టి సాయికామరాజు, యు.విజయ్, కుర్రా రాంబాబు, దారా సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

కాచిగూడ: రైల్వేస్టేషన్‌లో ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన రవికుమార్ భార్య ఎస్.నిర్మల (60) గుంతకల్ రైల్లో కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. బోరబండకు వెళ్లేందుకు ఎంఎంటీఎస్ రైలు టికెట్ తీసుకునేందుకు కుమారుడు వెళ్లగా అంతలోనే నిర్మల రైల్వేస్టేషన్ నుంచి బయటకు వెళ్లింది. తల్లి కనిపించకపోడంతో కుమారుడు వినోద్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. కుమారుడు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పథకాల అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం

రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదల పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ విమర్శించారు. కార్పొరేట్ శక్తుల రుణాలను మాఫీ చేసేందుకు మోదీ ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ దినోత్సవాన్ని పురస్కరించుకొని దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళీ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అబద్ధాల పుట్ట అని, కార్పొరేట్ శక్తులకు రూ. 25 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ, విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా ప్రజా బడ్జెట్ అని అబద్ధాలు ఆడుతుందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించాలని అలాగే పట్టణ ఉపాధి హామీని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో గత సంవత్సరం రూ. 89 కోట్లు ఖర్చు చేసిన కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 86 కోట్లు కేటాయించి 26 శాతం నిధులు పెంచామనేది పచ్చి అబద్ధమని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే ఆన్‌లైన్ హాజరు, ఆధార్ లింక్ విధానాన్ని తీసుకువస్తూఎత్తి వేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జాతీయ నాయకులు ఎస్.జీవన్‌కుమార్, ఉపాధి హామీ పరిశోధకులు చక్రధర్ బుద్ధా, డిబిఎఫ్ జాతీ కార్యదర్శి పి.శంకర్, మీరా సంగమిత్ర, పులి కల్పన, ఇందిర, ఫిరోజ్, మనోహర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్రమంత్రి


బాగ్ అంబర్‌పేటలో షాహిద్ నందరాజ్‌గౌడ్‌కి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


రత్నానగర్‌లో బస్తీవాసులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నల్లకుంట: ఎంపీ ల్యాడ్స్‌తో ఇటీవల నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్, సత్యానగర్‌లో చేపట్టిన కమ్యూనిటీ హాళ్ల పనులను కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నానగర్ బస్తీవాసులు కమ్యూనిటీ హాల్ పనులకు శంఖుస్థాపన చేయాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి నెల క్రితం స్థానిక ఎమ్మెల్యే ఈ పనులకు శంఖుస్థాపన చేశారని, అదే పనులకు తిరిగి శంఖుస్థాపన చేయడం సరైంది కాదని సున్నితంగా తిరస్కరించారు. అలాగే అభివృద్ధి పనుల పురోగతిని జీహెచ్‌ఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో కమ్యూనిటీ హాళ్ల పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి రత్నానగర్, సత్యానగర్ బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతం రావు, స్థానిక కార్పొరేటర్ అమృత, జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి, డీఈ ప్రవీణ్, దివ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, ఏఎంఓహెచ్ డాక్టర్ జ్యోతి, జలమండలి నారాయణ గూడ డీజీఎం సన్యాసి రావు, బర్కత్‌పుర సెక్షన్ మేనేజర్ భావన, రత్నానగర్ బస్తీ పెద్దలు ఈశ్వర్, నర్సింగ్ రావు, ఎంటీ. కిశోర్, పాతకోటి మహేశ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నందరాజ్‌గౌడ్ సేవలు స్ఫూర్తిదాయకం

అంబర్‌పేట్: షాహిద్ నందరాజ్‌గౌడ్ బీజేపీకి అందించిన సేవలు పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌ఐ ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురై అమరుడైన మాజీ కార్పొరేటర్ నందరాజ్‌గౌడ్ 1వ వర్ధంతి బాగ్‌అంబర్‌పేటలోని ఆయన స్మారక స్థూపం వద్ద శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నందరాజ్‌గౌడ్ కల అయోధ్య రామ మందిరం నిర్మాణంతో సాకరమైందని, దీంతో ఆయన ఆత్మ శాంతిస్తుందన్నారు. పార్టీ పటిష్టత కోసం నందరాజ్‌గౌడ్ చూపిన తెగువ చిరస్మరణీయం కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్లు కన్నె ఉమారమేశ్‌యాదవ్, అమృత, నందరాజ్‌గౌడ్ కుటుంబసభ్యులు కుమారుడు ఎం.రోహిత్‌గౌడ్, సతీమణి లలితానందరాజ్‌గౌడ్ బీజేవైఎం నాయకులు సునీల్, ప్రవీణ్ కుమార్, బాలకృష్ణ, సాయితాకూర్ పాల్గొన్నారు.

శంకరమఠంలో హరికథా మహోత్సవాలు షురూ


హరికథకురాలు డాక్టర్ సప్పా భారతిని సన్మానిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లకుంట: విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ కేవీ.రమణాచారి 72వ జన్మదినాన్ని పురస్కరించుకొని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో గురువారం సాయంత్రం హరకథా సప్తాహం మహోత్సవాలను ప్రారంభించారు. మొదటి రోజు ప్రముఖ హరికథకురాలు డాక్టర్ సప్పా భారతి 'శివలీలలు' హరికథా గానం ఆహుతులను ఆకట్టుకుంది. ఎం. శశిభూషన్ రావు వయోలిన్‌పై, సుధాకర్ మృదంగంపై వాద్య సహకారమందించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, విశిష్ట అతిథి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, గౌరవ అతిథి శంకర మఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె. కృష్ణారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. చివరగా హరికథకురాలు సబ్బా భారతిని శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ ఆర్. ప్రభాకర్ రావు, కార్యదర్శి మద్దాళి రఘురామ్, భోగరాజు మూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిపై అవగాహన


అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బందితో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమ

కాచిగూడ: ప్రపంచ లెప్రసీ నివారణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆర్‌ఎఫ్‌పీటీసీ కోఠి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ కుష్టు వ్యాధి శాపం కాదని, సాధారణ చర్మవ్యాధి మాత్రమేనని, ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే నియంత్రణ సాధ్యమేనని అన్నారు. స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్‌బాబు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మనోజ్ రెడ్డి, డాక్టర్ లలిత, శ్రీనివాస్ రెడ్డి, వనిత, ఆశ వర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

శివకుమార్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు


మద్దెల శివకుమార్‌కు నివేదిత లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేస్తున్న కోలేటి దామోదర్‌గుప్తా

చిక్కడపల్లి: మానవతావాది, అభ్యుదయవాదిగా నిరంతర సేవా తత్పరుడు శివకుమార్ అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. నివేదిత ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగాన సభలో నిర్వహించిన 'దొరకునా ఇటువంటి సేవ' శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గాయనీగాయకులు చిత్రగీతాలను ఆలపించారు. అనంతరం సినీగీత రచయిత ఆచార్య మద్దెల శివకుమార్‌కు నివేదిత లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖులు టి.పట్టాభి, ఆర్.రాంబాబు, శివకుమార్, దయానందరావు, కిరణ్, కుసుమ బోగరాజు, ధన్‌రాజు, సుభాష్, అమని, అఖిల, స్వరకల్యాణి, శ్రీదేవి, రవీంద్రనాథ్, రాజన్, సీతారామయ్య పాల్గొన్నారు.

అంబర్‌పేట ప్రధానకార్యదర్శిగా దర్శన్


దర్శన్‌కు నియామక పత్రం అందజేస్తున్న గాలిపెల్లి కృష్ణ

కాచిగూడ: తెలంగాణ మున్సిపల్ స్వీపర్స్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ యూనియన్ అంబర్‌పేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కాచిగూడకు చెందిన దర్శన్‌ను నియమిస్తూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గాలిపల్లి కృష్ణ, అధ్యక్షురాలు పి. ఇందిర శుక్రవారం ఆయనకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ స్వీపర్స్, కామాటీల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

సికింద్రాబాద్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుగా కె.ఆర్.కె ప్రసాద్



కవాడిగూడ: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్‌కు చెందిన కె.ఆర్.కె ప్రసాద్ నియామకమయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ శుక్రవారం ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేసి సికింద్రాబాద్‌లో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కె.ఆర్.కె ప్రసాద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపునకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంపుపై హర్షం

కాచిగూడ: విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును మార్చి 31 వరకు పెంచడంపై తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సేనా రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పెరిగిన ధరలకనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జిలు పెంచాలని, అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ విద్యార్థులకు కూడా అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎంబీసీ కార్పొరేషన్‌కు చట్టబద్ధ హోదా కల్పించాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎంబీసీ సంక్షేమ కార్పొరేషన్‌కు చట్టబద్ధమైన హోదా కల్పించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్లు ప్రకటించడం హర్షణీయమని, దీనిని వేగవంతంగా పూర్తి చేసి కులాల వారీగా నిధులు కేటాయించి ఖర్చు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కులగణన ప్రారంభమైందని, 50 లక్షలకు పైగా బీసీ కుటుంబాల గణన నిర్వహించారని గుర్తుచేశారు. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తేనే బడుగు బలహీన వర్గాల్లో జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. అణగారిన వర్గాల స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

శ్రీనగర్‌కాలనీ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారి కోసం శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఐవీవై ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2024ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై ఆయా యూనివర్సిటీల వివరాలను వెల్లడిస్తారన్నారు. ఔత్సాహిక విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకుంటే, ఉచితంగా రిజిస్ట్రేషన్ నిమిత్తం ఫోన్: 70557 27272, 91054 91054లలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 3న (నేడు) ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాపునగర్ ఫీడర్ పరిధిలో బాపునగర్, ఓవైసీ నగర్, నెక్లెస్ హోటల్, ఆకాశ్‌నగర్, శివాలయం టెంపుల్ ఫీడర్ పరిధిలో శివాలయం, తాడి కంపౌండ్, సంజీవయ్యనగర్, వెజిటేబుల్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11.30, జిందాతిలిస్మత్ ఫీడర్ పరిధిలో జిందాతిలిస్మత్, శంకర్‌నగర్, దుర్గానగర్, అన్నపూర్ణనగర్, పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, కృష్ణానగర్, ఆజామ్‌నగర్, అంబేద్కర్‌నగర్, వడ్డెర బస్తీ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30, సుందర్‌నగర్ ఫీడర్ పరిధిలో సుందర్‌నగర్, నెహ్రూనగర్, బోస్ ఫ్యాక్టరీ, కాచిగూడ కమేలా తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4.30 వరకు, ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్, పటేల్‌నగర్ చౌరస్తా, హనుమాన్ టెంపుల్, సునర్‌బౌలీ జంక్షన్, బీజేపీ జెండా, చే నంబర్ ఫీడర్ పరిధిలో గోల్నాక చర్చి, అశోక్‌నగర్, తిలక్‌నగర్, చే నంబర్, వెజిటేబుల్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న దివ్యనామ సంకీర్తనలు



దివ్యనామ కీర్తనలు చేస్తున్న శ్రీరామ గానసభ నాదోపాసన బృందం

నల్లకుంట: శ్రీ రామ గానసభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతీ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ గాన సభ నాదోపాసన బృందం ఆలపించిన దివ్యనామ సంకీర్తనలు అలరించాయి. గానసభ కార్యదర్శి కొణికి శ్రీనివాస శర్మ మాట్లాడుతూ.. శనివారం (నేడు) నుంచి త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి ప్రముఖ ప్రవచకురాలు డాక్టర్ అనంత లక్ష్మీ ప్రవచనాలు, అచలా శంకర్‌నాథ్‌చే వీణా గానం, ఎరామగాన సభ నాదోపాసన బృందంచే దివ్యనామ సంకీర్తనలు ఉంటాయన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నేతలు

కవాడిగూడ: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు కార్పూరి ఠాగూర్‌కు భారతరత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కవాడిగూడ డివిజన్ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కవాడిగూడ సంఘం అధ్యక్షుడు కె. రాములు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యం, కోశాధికారి ఎ.శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ మోర్చా నాయీబ్రాహ్మణ సంఘం, మహంకాళి జిల్లా కన్వీనర్ సంతోష్, మాజీ కార్పొరేటర్ టి. రవిందర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, సురేశ్ ముదిరాజ్, జమాల్‌పురి నందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


చే నంబర్ చౌరస్తాలో పైపులైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. చే నంబర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ నిర్మాణంతో ఓ అపార్ట్‌మెంట్ ఎదుట తలెత్తిన పైపులైన్ సమస్యను శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణంతో పరిసరాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఫీవర్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా


ఫీవర్ ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

నల్లకుంట: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో పని చేస్తున్న సుమారు 80 మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రెండు రోజులుగా ఉదయం విధులకు ఆటంకం కలగకుండా గంటపాటు నిరసన తెలిపారు. అయినప్పటికీ నక్షత్ర, సాహితీ ఏజెన్సీల నుంచి స్పందన రాకపోవడంతో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) మద్దతుతో శుక్రవారం ఉదయం ఆసుపత్రి ఆవరణలో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి ఆర్‌ఎంవోలు నాయకులు, ఉద్యోగులను తన చాంబర్‌కు పిలిచి మాట్లాడారు. వేతనాల చెల్లింపై స్పష్టమైన హామీ ఇవ్వాలని నాయకులు పట్టుబట్టగా సూపరింటెండెంట్‌ను కలవాలని వారు సూచించారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామదాసు, నక్షత్ర- సాహితీ ఏజెన్సీల ప్రతినిధులు, యూనియన్ నాయకులతో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొందరితో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక శాఖ నుంచి ఏదైనా కారణాలతో నిధుల మంజూరులో జాప్యం జరిగితే ఉద్యోగులకు వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత పూర్తిగా ఏజెన్సీలపైనే ఉంటుందన్నారు. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు రెండు నెలల జీతాలు చెల్లించామని, మరో నెల వేతనాలు ఈ నెల 5న చెల్లిస్తామని ఏజెన్సీల ప్రతినిధులు సూపరింటెండెంట్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, టీఎంహెచ్‌ఈయూ ఫీవర్ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు జనార్దన్, సతీశ్, పద్మజ, నాయకులు నవాజ్, యస్మీన్, భాగ్య పాల్గొన్నారు.

రేపు ఇంద్రాసేనారెడ్డికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డికి రేపు (4న) ఓయూలో సన్మానం జరగనుంది. ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డా.విజయ్‌కుమార్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.